క్లుప్తంగా

ఆస్పత్రికి రోగుల తాకిడి



బాడంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

బాడంగి: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. గత రెండు రోజుల్లో డయేరియా, జ్వరాలతో బాధపడుతున్న దాదాపు 63 మంది ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందగా, వీరిలో 25 మంది వరకు డిశ్చార్జి అయ్యారు. అప్రమత్తమైన వైద్య సిబ్బంది సకాలంలో రోగులకు వైద్యసేవలు అందేలా చర్యలు చేపడుతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, తగిన జాగ్రత్తలు పాటిస్తే వాటికి దూరంగా ఉండొచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

శాంతియుత ర్యాలీ



ర్యాలీలో క్రైస్తవ మతవిశ్వాసులు

రాజాం సిటీ: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను వ్యతిరేకిస్తూ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలో శాంతియుత ర్యాలీ ఆదివారం నిర్వహించారు. పారిస్ కౌన్సిల్ సభ్యులు బొత్స జానకీరావు మాట్లాడుతూ మణిపూర్ ఘటనతో సభ్యసమాజం తలదించుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు. ప్రభుత్వాలు స్పందించి, రాక్షస మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయ్‌రెడ్డి, మరియదాస్, నారాయణరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



బూరాడలోని ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ

రేగిడి: నకిలీ పురుగుమందులు, విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని బూరాడ, పనసలవలస గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఆయన పురుగుమందుల వివరాలపై ఆరాతీశారు. అనంతరం వాటి కాల పరిమితి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులు సూచించిన పురుగులమందులు, ఎరువులు, విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు.

పశుగ్రాసం పెంపకంపై రైతుల ఆసక్తి



వావిలవలసలో సాగు చేస్తున్న పశుగ్రాసం

రేగిడి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పశుగ్రాసం పెంపకానికి ఆసక్తి చూపిస్తున్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధి చెందడంతో పాడిఆవులు పెంచుతున్న రైతులు పశుగ్రాసం కొరత లేకుండా ఉండడంపై దృష్టిసారిస్తున్నారు. వావిలవలస, అంబఖండి, సంకిలి, ఉంగరాడ తదితర గ్రామాల్లో పశుగ్రాసంను అధికంగా సాగు చేస్తున్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న విత్తనాల ద్వారా పశుగ్రాసం పెంచి, వాటిని పశువులకు వేయడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతోందని పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.

నిత్యవసర సరుకుల పంపిణీ



దత్తత కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న యువకులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన రెండు దత్తత కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. గ్రామంలోని శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా వీటిని అందజేసి, తమ ఔదార్యం చాటుకున్నారు. సంఘం తరఫున మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేయనున్నామని, సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసరావు, బి.భాస్కరరావు, జి.గోవిందరావు, జె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతుకు వెన్నుదన్ను

- జోరుగా కౌలుకార్డుల పంపిణీ
- ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణ సదుపాయం
- సాధారణ రైతులతో సమానంగా ప్రభుత్వ పథకాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న కౌలురైతాంగం



కౌలుకార్డులు అందజేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, తహసీల్దార్ రాజారావు(ఫైల్)

రామభద్రపురం: కౌలురైతుకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వారి కష్టాన్ని గుర్తించిన జగనన్న సర్కారు సీసీఆర్(క్రాప్ కల్టివేటర్ రైట్/పంట సాగు హక్కు)కార్డులు మంజూరు చేసి, అండగా నిలుస్తోంది. సీసీఆర్ కార్డుతో సాధారణ రైతులకు వర్తించే ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ కౌలురైతుకూ వర్తిస్తాయి. ఒక్కో కౌలురైతుకు ఏడాదికి రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ ఏడాది కూడా కౌలురైతులకు రైతు భరోసా పథకం సాయం చెల్లించేందుకు సీసీఆర్ కార్డులు మంజూరు ప్రక్రియ జోరుగా జరుగుతోంది. ఇప్పటికే జిల్లాలో 11,830 మంది కౌలురైతులకు ఈ కౌలు కార్డులు అందజేశారు.

ప్రభుత్వ నిర్ణయంతో మారిన దశ, దిశ..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నిర్ణయంతో కౌలురైతుల దశ, దిశ మారింది. గతంలో వీరికి కౌలు కార్డులు మంజూరు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండేది కాదు. భూ యజమాని అనుమతిస్తే తప్ప వీరికి ఎలాంటి ప్రభుత్వ రాయితీలు వచ్చేవి కావు. అలాగే వారు పండించిన పంటలను కొనుగోలు కేంద్రాల్లో నేరుగా విక్రయించుకోలేని దుస్థితి ఉండేది. బ్యాంకు రుణాలైతే అందని ద్రాక్షగానే మిగిలేవి. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ కౌలురైతుల కష్టాలను గుర్తించింది. భూ యజమాని హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా పంట సాగు చేస్తున్న కౌలురైతుకు అన్ని రాయితీలు వర్తించేలా పంట



కౌలురైతు సాగు చేస్తున్న బీర పంట

సాగు హక్కు పత్రాలను అందజేస్తోంది. వీటితో వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే సకల రాయితీలు కౌలురైతులు నేరుగా పొందడంతో పాటు బ్యాంకుల నుంచి ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందే వెసులుబాటును కల్పించింది.

ఆదుకుంటున్న రైతు భరోసా పథకం..

ఎక్కడా లేని విధంగా కౌలురైతులకు రైతు భరోసా పథకం నగదు ఇచ్చే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రైతులకు పీఎం కిసాన్ ద్వారా ఏడాదికి మూడు విడతల్లో రూ.2 వేలు చొప్పున రూ.6 వేలు అందిస్తే, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.7,500 కలిపి రైతు భరోసా కింద మొత్తం రూ.13,500 చెల్లిస్తోంది. కానీ కౌలురైతులకు కేంద్రం ఎలాంటి నగదు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో కౌలురైతులను ఆదుకోవాలని సంకల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో కౌలురైతుకు ఏడాదికి రూ.13,500 చర్యలు తీసుకున్నారు. భూ యజమాని హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా 11 నెలల కాలపరిమితితో పంట సాగు చేస్తున్న కౌలురైతుకు కార్డు పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

అర్హులందరికీ కౌలుకార్డులు...



అర్హత కలిగిన కౌలురైతులందరికీ కౌలుకార్డులు అందజేస్తున్నాం. ఈ కార్డులు జారీ వల్ల భూ యజమానికి ఏ విధమైన ఇబ్బంది ఉండదు. కేవలం 11 నెలల కాల పరిమితితో కార్డు పనిచేస్తుంది. సాగు హక్కు తప్ప భూమిపై వారికి హక్కు ఉండదు. ఇంకా ఎవరైనా అర్హులుండి, దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా కౌలుకార్డులు ఇస్తాం.

– రాజారావు, తహసీల్దార్, రామభద్రపురం.

స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్ ఐటీ సీటు



తాను సాధించిన ట్రోఫీతో విద్యార్థిని వినీత

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ముత్యాల వినీత స్పోర్ట్స్ కోటాలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించినట్లు జెడ్పీటీసీ సభ్యులు అప్పికొండ సరస్వతి, ప్రధానోపాధ్యాయుడు రావాడ భాస్కరరావు ఆదివారం తెలిపారు. సదరు విద్యార్థిని 9వ సీనియర్ సాఫ్ట్‌బాల్ అంతర్‌రాష్ట్ర పోటీల్లో విజేతగా నిలిచి, విజయనగరం జిల్లా జట్టులో సభ్యురాలుగా ఉందని వ్యాయామ ఉపాధ్యాయుడు రత్నకిశోర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పలు పతకాలు సాధించడంతో పాటు చెన్నైలో జరిగిన జాతీయ జూడో పోటీల్లో కూడా సదరు విద్యార్థిని పాల్గొందన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిస్తే మంచి, మంచి అవకాశాలు వస్తాయని, చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని జెడ్పీటీసీ ఆకాంక్షించారు.

గద్దర్‌కు ఘననివాళి



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని బీఎస్పీ కార్యాలయంలో ప్రజావాగ్గేయకారుడు గద్దర్‌కు ఆదివారం ఘననివాళులర్పించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొత్స బుద్ధుడు మాట్లాడుతూ సామాజిక ఉద్యమకారునిగా తన పాట ద్వారా గుర్తింపు పొందిన గొప్పవ్యక్తి గద్దర్ అని కొనియాడారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన మహాయోధుడని, దళిత కుటుంబంలో పుట్టి, ఇంజినీరింగ్ విద్యనభ్యసించినప్పటికీ ప్రజా పోరాటానికి తన జీవితాన్నే త్యాగం చేశారన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారన్నారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ డి.రామప్పడు, కేఎన్‌పీఎస్ నేతలు ఎస్.గురుమూర్తి, వి.పాపారావు, ఆర్.జయరావు, జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు



ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న కొత్త ప్యానల్ బోర్డు

రాజాం సిటీ/రాజాం: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామని జి.వి.రాజ్యలక్ష్మి తెలిపారు. నాడు-నేడు పనుల్లో భాగంగా హైటెన్షన్ పనులు చేస్తుండడంతో ఆస్పత్రిలో శనివారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, దీంతో రోగులు అసౌకర్యానికి గురైన విషయాన్ని గుర్తించామన్నారు. ఆదివారం విద్యుత్ పనులకు సంబంధించి, కొత్తగా ప్యానల్ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పటికీ వైద్యసేవలకు ఎటువంటి అంతరాయం లేదన్నారు.

నేడు బొద్దాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ నక్క వర్షిణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులుతో పాటు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులంతా హాజరు కావాలని కోరారు.

పారదర్శకంగా 'ఉపాధి' పనులు

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి జరిగిన సోషల్ ఆడిట్‌పై ఆదివారం గ్రామసభ నిర్వహించారు. డీఆర్‌పీ సురేష్ మాట్లాడుతూ పనులను తనిఖీ చేశామని, పనులు చాలా పారదర్శకంగా జరిగాయని తెలిపారు. సర్పంచ్ బొద్దల పద్మ మాట్లాడుతూ గ్రామంలో మెట్ట ప్రాంతం లేని కారణంగా 100 రోజుల పనిదినాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రౌతు తిరుపతిరావు, టీఏ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ ధ్యానంపై అవగాహన రేపు

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఈ నెల 15వ తేదీన పిరమిడ్ ధ్యానంపై అవగాహన కల్పించనున్నట్లు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్ కొత్తా రమేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి 108 ఏళ్ల వయసు కలిగిన హిమాలయ యోగి సంత్ సదానందగిరి మహారాజ్ ముఖ్య వక్తగా హాజరై, పిరమిడ్ ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించనున్నారన్నారు. ఈ ధ్యానంతో శారీరక, మానసిక రుగ్మతలు నివారించవచ్చన్నారు.

చురుగ్గా జలజీవన్ మిషన్ పనులు



రేగిడి: బొడ్డవలసలో ఇంటింటికీ ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీ పరిధిలోని బొడ్డవలస గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు చేస్తుండగా, ఈ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.శ్రీచరణ్, ఎంపీటీసీ మజ్జి సంధ్యాశ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి ఆదివారం పరిశీలించారు. గ్రామంలోని మొత్తం 155 ఇళ్లకు పూర్తి స్థాయిలో ఇంటి వద్దకే తాగునీటిని అందించే పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు.





తీరిన 'వే'దన

చిత్రంలో కనిపిస్తోంది.. రాజాం మండలం, నందబలగ పంచాయతీ, లక్ష్మీపురం గ్రామ ప్రధాన వీధి రోడ్డు. సీసీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా గతంలోని టీడీపీ పాలకులు పట్టించుకోలేదు. ఏ చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా బురదమయమయ్యేది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడేవారు. ఇదే సమస్యను ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం విడుదల చేసిన రూ.4.95 లక్షల నిధులతో 110 మీటర్ల పొడవైనా సీసీ రోడ్డు నిర్మించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– రాజాం

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందనలు..



విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మండలంలోని పరశురాముడిపేటకు చెందిన పాలధార హేమలత అనే విద్యార్థినిని ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం అభినందించారు. టీటీడీ(తిరుమల తిరుపతి దేవస్థానం) నిర్వహించిన మన సంస్కృతి పోటీల్లో భాగంగా హిందీ విభాగంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో సదరు విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో థర్డ్ ర్యాంకు సాధించి, 2 వేల నగదు బహుమతి గెలుచుకుంది.

ఈ నేపథ్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విద్యార్థిని ప్రతిభను ఎమ్మెల్యేతో పాటు గ్రామస్తులు మెచ్చుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు అప్పలమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!



రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కిప్పింగ్ ఆడుతున్న విద్యార్థినులు



తెర్లాం హైస్కూల్‌లో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రామభద్రపురం: స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహిస్తున్న క్రీడపోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, లాంగ్‌జంప్ తదితర పోటీలతో పాటు సినిమా పాటలు, జానపద గేయాల ఆలాపన పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కూడా తమకు ఇష్టమైన ఆటలు ఆడి, తమలోని ప్రతిభను నిరూపించుకుంటున్నారు. ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్య్ర వేడుకల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని ఎంఈఓ తిరుమలప్రసాద్ తెలిపారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని విద్యార్థులంతా తమకు నచ్చిన క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

తెర్లాం: స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఆదివారం నిర్వహించారు. మండల కమ్యూనిటీ సోషల్ వర్కర్ చింతా హరీష్ నేతృత్వంలో బాలలకు అందుబాటులో న్యాయం అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు చేపట్టారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో ముగ్గురు విద్యార్థులను ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల కమ్యూనిటీ సోషల్ వర్కర్ మాట్లాడుతూ బాల్య వివాహాలపైనా, బాల కార్మికుల చట్టాలపైనా గ్రామాల్లోని పిల్లలకు అవగాహన కల్పిస్తున్నామని, దీనిలో భాగంగానే పాఠశాలల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బొబ్బిలి: మొక్కలు నాటుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు



రాజాం: అంతకాపల్లిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ చిన్నంనాయుడు

రాజాం: పర్యావరణ పరిరక్షణ అనేది అందరి బాధ్యత అని అంతకాపల్లి గ్రామ సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఆదివారం నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించి, మొక్కలు నాటారు. సచివాలయ పరిసర ప్రాంతాలతో పాటు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా దాదాపు 75 మొక్కలు నాటారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పంపిణీ చేసిన ఈ మొక్కలను పరిరక్షించే బాధ్యతను ఉపాధి హామీ వేతనదారులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొర్రోతు కాంతారావు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: సత్యసాయి ప్రేమ తరు కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల కేంద్రంలో సత్యసాయి భక్తులు మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. స్వర్గధామం, ఆస్పత్రి, ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ అని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్కను నాటి, పరిరక్షించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో సత్యసాయి జోనల్ కన్వీనర్ సత్యనారాయణ, కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు మొక్కలు నాటి, కాసేపు మాట్లాడారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, వి.ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని, ఈ నేపథ్యంలో మొక్కలు పెంపకానికి అందరూ ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముద్దాడ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన



బ్రహ్మాస్త్రం కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సింహాద్రినాయుడు

తెర్లాం:

మండలంలోని పూనువలస గ్రామంలో బ్రహ్మాస్త్రం(కషాయం) తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నేపల్లి సింహాద్రినాయుడు మాట్లాడుతూ బ్రహ్మాస్త్రం కషాయం పంటలపై పిచికారీ చేయడం వల్ల పంటను ఆశించే తెగుళ్లను నివారించవచ్చన్నారు. రైతులు తక్కువ ఖర్చుతో బ్రహ్మాస్త్రం కషాయాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు. బ్రహ్మాస్త్రం తయారీకి జామ, కానుగ, బొప్పాయి, జిల్లేడు, వేపాకులను ఒక్కో రకం 2 కేజీల చొప్పున తీసుకోవాలన్నారు. ఈ ఆకులన్నింటినీ వేర్వేరుగా బాగా దంచి, ఓ పాత్రలో తీసుకున్న 15 లీటర్ల ఆవుమూత్రంలో కలిపి బాగా మరగబెట్టాలన్నారు. బాగా మరిగిన రసాన్ని వడకట్టి, ఓ పాత్రలో తీసుకోవాలని, దానిని 5 లీటర్ల చొప్పున పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చన్నారు.

ఆన్‌లైన్‌లో దేవదాయ శాఖ భూముల వివరాలు

రాజాం: నియోజకవర్గ పరిధిలోని దేవదాయ శాఖ భూములన్నీ ఆన్‌లైన్ చేస్తున్నామని రాజాం మేనేజర్ బీవీ మాధవరావు అన్నారు. స్థానిక పోలిపల్లి పైడితల్లి ఆలయం వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన రాజాం పట్టణంతో పాటు రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లోని దేవదాయ శాఖ పరిధిలోని ఆస్తులను గుర్తించి, సర్వేలో భాగంగా వివరాలన్నీ ఒకచోట చేర్చుతున్నామన్నారు. వీటిని ఆయా మండలాల్లోని ఏ దేవాలయం పరిధిలో, ఎంతమేర ఉన్నాయో అనే వివరాలుతో పాటు కౌలు పొందిన రైతులు వివరాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. రాజాం, సంతకవిటి మండలాల్లో ఎక్కువగా దేవాదాయ శాఖ భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని తెలిపారు.